మనదేశమంటే నాకెంతో ఇష్టం. మన సంప్రదాయాలంటే ఇంకా ఇష్టం. కానీ మన సంప్రదాయాలు కొన్ని నాకు దురదృష్టకరంగా పరిణమించాయి. కారణమేమీ లేదు.

నేను ఆడదాన్ని... అంతే!

వాన వస్తే చేతులు జాపుకుని చినుకుల్లో తడవడం నాకెంతో ఇష్టం. బాగా చిన్నప్పుడలా చేసేదాన్ని. అమ్మ కంగారుపడేది— జలుబు చేస్తుందని! కానీ నేను మొండిదాన్ని! అమ్మకు తెలియకుండా చాలాసార్లు తడిశాను. తడిశాక అమ్మ దెబ్బలాడేది.

నాకు జబ్బు చేయలేదుగా— అనేదాన్ని.

అమ్మకేమనాలో తెలిసేది కాదు.

అలా నాకు పన్నెండేళ్ళు వచ్చేవరకు సాగింది. తర్వాత నుంచి అమ్మ "ఆడపిల్లవు కదుటే— ఒద్దిక నేర్చుకోవాలి" అనేది.

అది నాకు నచ్చేది కాదు. కానీ అమ్మకిప్పుడింట్లో అందరి వత్తాసూ ఉంది.

అమ్మకేమి సమాధానం చెప్పాలో నాకు తెలియడం లేదు.

నాకు పదహారేళ్ళు వచ్చేసరికి అమ్మ చెప్పక్కర్లేకుండానే నేనాడపిల్లనని ఇతరుల చూపులు నాకు తెలియబరిచేవి.

వాన చినుకుల స్పర్శ శరీరానికి గిలిగింతలు పెట్టడం వరకూ బాగానే వుంది. ఆ శరీరాన్ని చూసే ఇతరుల చూపులు నన్ను వాడిగా గుచ్చుతున్నాయి.

ఆడపిల్లనైన కారణంగా వానలో తడిసే అదృష్టానికి దూరమయ్యాను. అంతేకాదు......

ఎండల్లో చెమటలు, వేడి గాలి మనిషి ప్రాణం తీస్తూంటే చారల డ్రాయరు తప్ప ఇంకేమీ లేకుండా అన్నయ్య, మోకాళ్ళదాకా మడిచి కట్టిన లుంగీపంచెలో నాన్నగారు ఇంట్లో హాయిగా తిరిగేవారు. ఏడు గజాల

# పురుగు

## జొన్నలగడ్డ రామలక్ష్మి





చీర, ఎనభై సెంటీమీటర్ల రవికతో అమ్మ, కాలేజీకి వెళ్ళడానికెన్ని దుస్తులు ధరించాలో అన్నీ ధరించి నేనూ ఇంట్లో తిరగాల్సివచ్చేది. అప్పుడు నాకు మగాళ్ళను చూస్తే ఉక్రోషం పుట్టుకొచ్చేది. చిన్నచిన్న డ్రాయర్లతో ఇళ్ళలో తిరిగే రెండుమూడేళ్ళ వయసుగల పిల్లలను చూస్తుంటే పెద్దదాన్నెందుకయ్యానా అని బాధకలిగేది.

"ఎండ వేడి భరించక తప్పదు. వానకు దూరంకాక తప్పదు" అన్న శిలాశాసనా లాడదానికి మన సంప్రదాయమే ఇచ్చింది. అందుకని నేను సంప్రదాయం గురించి అలాంటప్పుడు బాధపడేదాన్ని.

అలాగని నేను విప్లవవాదిని కాను.

నా తండ్రి మంచి మొగుణ్ణే తెచ్చి చేస్తే కట్నమెక్కణ్ణుంచి తెస్తారూ అని ఆలోచించకుండా భావి జీవితం గురించి కలలు కన్నాను. పురుషుడి ఆధిపత్యం గురించి బాధపడకుండా అవసరం లేకున్నా నా పేరు చివర శ్రీవారి పేరు తగిలించుకుని అదే ఒక పి.హెచ్.డి. డిగ్రీ అన్నట్లు గర్వపడ్డాను. కన్నవారిని ముంచి శ్రీవారికే అంకితమైపోయాను.

శ్రీవారికి నేనంటే గౌరవముండేది. గౌరవాన్ని మించిన ప్రేమాభిమానాలుండేవి.

"నీలో మంచి ఆలోచనాశక్తి వుంది. లోతుగా ఆలోచిస్తే స్త్రీ జాతికే మణిపూసవౌతావు. నీవేమైనా సాధించదల్చుకుంటే నా చేయూత నిస్తాను" అన్నారాయన.

"నేనేమి సాధించాలి?" అన్నాను.

"మన సంప్రదాయం మార్చడం".

నిజానికి మన సంప్రదాయంలో స్త్రీకి ఉన్న ఇబ్బందుల కంటె— రక్షణే ఎక్కువ. కొందరు స్త్రీలు కష్టాలు పడుతూండవచ్చు. నాదాకా వస్తే తప్ప ఆ కష్టాలెలాంటివో తెలియదు. నాకు జీవితం సుఖంగానే వుంది.

సమ్మర్లో నా ఇబ్బంది తీరేవిధంగా యూనీకూల్ ఫ్యాన్ కొన్నారు శ్రీవారు. నా వాన సరదా ఇంట్లోని షవరు తీరుస్తోంది.

వానలో అయితే నాకూ, వాన చినుకులకూ మధ్య దుస్తులడ్డముంటాయి. షవరుక్రింద అయితే ఆ అడ్డు కూడా లేదు.

షవర్ బాతంటే నాకెంతో ఇష్టం.

ఇప్పుడు నాకు ఆడపుట్టుకంటే చిరాకు లేదు.

నాకు సంబంధించినంతవరకూ ఆడపుట్టుక వల్ల వుండే సమస్యలు తీరిపోయాయి.

"నీ తెలివిని స్వార్థం మింగేస్తోంది" అని శ్రీవారు బాధపడేవారు.

ఆయనిది సున్నిత మనస్తత్వం.

ఎంత సున్నితమంటే కుడుతున్న దోమను కూడా చంపలేరు. ఏ జీవిని చంపాలన్నా ఆ జీవి పడే మరణ వేదన ఆయన ఊహలోకి వస్తుంది.

ఇంట్లో దోమల్నీ, బొద్దింకల్నీ నిర్దాక్షిణ్యంగా చంపగలిగేది నేనే!

ఆఖరికి ఏ తేలో, జెర్రో వచ్చినా దాన్ని నేనే చంపాలి.

శ్రీవారిని పిరికి అని వేళాకోళం చేసినా ఆయన చలించరు.

చిన్నచిన్న పురుగులనైతే ఆయన నన్ను కూడా చంపనిచ్చేవారు కారు.

బయట పారేస్తున్నానని అబద్ధం చెప్పి టాయ్‌లెట్లోకి విసిరేసి గొలుసు లాగేదాన్ని.

ఇదీ నా మనస్తత్వం!

కానీ ఈ రోజు నాకేమైందో తెలియదు.

పచ్చగా బంగారంలా మెరిసిపోతున్న నా వళ్ళు నాకే ముద్దొస్తోంది. నా వంటిమీద ముత్యాల్లా జలజలా జారిపోతున్న షవరు నీళ్ళు నన్నేదో లోకాలకు తీసుకుని పోతున్నాయి. నా చేతిలోని జాస్మిన్ సబ్బు పరిమళం నన్ను స్పృహ వుండీ లేనట్లు చేసింది.

ఆ సమయంలో...

నా కంటికి నల్లగా కనిపించిందొక చిన్న పురుగు.

ఆ పురుగు నాకు తెలుసు.

దాని పేరు నాకు తెలియదు.

అరంగుళం పొడవున నల్లగా వుంటుందది. వీపు గట్టిగా రాయిలా వుంటుంది. అత్యవసర పరిస్థితుల్లో ఓ రెండు మూడంగుళాల ఎత్తుకి ఎగరగల దది.

చాలాసార్లు నే నలాంటి పురుగుల్ని టాయిలెట్లో పడేసి గొలుసు లాగేశాను.

అదే పురుగు!

షవరు నీరు నావంటిమీంచి జారి నేలమీద పాకుతూ డ్రెయినేజిలోకి పోతోంది.

ఆ ప్రయత్నంలో తనూ కొట్టుకుపోకుండా శత విధాల ప్రయత్నిస్తోందా పురుగు.

పురుగు చాలావరకు నీటిలో మునిగిపోయింది. అందువల్ల అది ఎగరలేకపోతోంది.

ప్రవాహంలో మంచి వేగముంది. అందువల్ల అది తట్టుకోలేకపోతోంది.

చటుక్కున షవరు ఆపాను నేను.

ప్రవాహం వేగం తగ్గింది.

పురుగు నీటికి ఎదురీదగల్గుతోంది.

నేను చుట్టూ చూశాను.

కొత్తగా విప్పిన సబ్బు కాగితం ఓ మూలగా పడి వుంది.

అది తీసి పురుగు ముందు పెట్టాను.

పురుగు నెమ్మదిగా ఆ కాగితం మీదకు ఎక్కింది.

నేనా కాగితాన్ని గదిలో ఓ మూలగా వుంచాను.

ఆ తర్వాత స్నానం కొనసాగించాను.

స్నానం చేస్తున్నంతసేపూ నా దృష్టి ఆ పురుగుమీదనే వుంది.

అదిప్పుడు సురక్షిత స్థానంలో వుంది. అయినా షవరులోంచి నా ఒంటిమీద పడ్డ నీరు దానిమీదకు పోకుండా జాగ్రత్తపడుతూ స్నానం చేశాను.

ఆ పురుగు పట్ల నేను తీసుకుంటున్న శ్రద్ధ నాకే ఆశ్చర్యం కలిగించింది.

స్నానమై బయటకు వచ్చేక శ్రీవారితో జరిగింది చెప్పి "ఆర్నెల్ల సావాసంలో వారు వీరవుతారంటారు.

## హర్షసుందరి

ఈ శ్రావణ మాసంలో
నీలాకాశం అంచుల్లో
చురుక్కున తళుక్కుమనేవు
చటుక్కున అదృశ్యమయ్యేవు
నీలి రంగు చీరను మార్చి
కాటుక చీరను కట్టేవు
వెండి తునకల అంచులతో
మెరమెర మంటూ మెరిసేవు
మనసులను మురిపించేవు
బిరాన మాయం అయ్యేవు
మందమారుతాన్ని చర చర వెంట తెచ్చేవు
అంతలోనె కినిసి పవనాన్ని
నేల వదలి బిర బిర వెళ్ళేవు
ఎందుకో మరి చిరునవ్వుల జల్లులు కురిపించేవు
మరెందుకో ఆ చిరుజల్లును జడివానగ
మారగనీవు
ముదితల మనసులు చంచలమైనవను
వాదు మనకెందుకులేమ్మా
ఓ వర్షసుందరీ!
వలదని మరి మరి వారించు వరకు
మా ఇలపై కొలువుండగ తరలిరావమ్మా
ఇక్కడ హింసకు పట్టం కట్టుదురని వెరవకు
ఓ జలదాంబరీ!
మానవతాపూరిత నీ ప్రేమమయ శీతల
కరస్పర్శతో
హింసయైనా మరి ఏ విధ్వంసమైనా
కరిగి కరిగి నీరయిపోవును కాదా
ఓ హర్షసుందరీ!

—ఇసుకపల్లి సుజాత

నా విషయంలో అదే జరిగినట్లుంది'' అన్నాను.

శ్రీవారు నవ్వి ''అదేం కాదులే గానీ— నువ్వు మీ అమ్మగారికి ఉత్తరం రాసేవా?'' అనడిగారు.

''ఇంకా రాయలేదు'' అని ఉలిక్కిపడ్డాను.

ధవళేశ్వరం అమ్మ పుట్టిల్లు.

ఏదో పనిమీద అక్కడకు వెళ్ళిందమ్మ.

ఉన్నట్లుండి ఊళ్ళోకి వరద ముంచుకొచ్చింది.

అమ్మ, తాతగారు, అమ్మమ్మ, ఇద్దరు మామయ్యలు...

ఎక్కడికి వెళుతున్నారో తెలియని స్థితిలో కట్టుబట్టలతో ఆ ఊరినుంచి పారిపోయారు.

అదృష్టవశాత్తు వారికో చోటు దొరికింది.

హఠాత్తుగా నీరు చుట్టుముట్టడం వల్ల వాళ్ళలో ఏ ఒక్కరూ ప్రాణాలతో మిగలవలసింది కాదు.

వారిలో ఒక్క మామయ్యకు మాత్రం ఈత వచ్చు. మిగతా ఎవ్వరికీ రాదు.

ఆ ఒక్క మామయ్యా వాళ్ళను రక్షించలేదు.

ఏ మహానుభావుడో పూనుకొని వారిని నీటి బారి నుండి రక్షించాడు. ముందు వారిని జనార్దనస్వామి కొండ మెట్లెక్కించాడు.

అమ్మ షాక్ తింది.

ఆ కొండమీద తానొక రోజుంది. అదొక భయంకరానుభవం.

చుట్టూ నదీ జలాలు. ఓ కొండమీద వందలాది జనం.

అక్కడి నుంచి సురక్షిత ప్రాంతం చేరుకునేవరకూ అమ్మకు మతి మతిలోలేదు.

తను క్షేమంగా ఉన్నట్లు నాకుత్తరం రాసింది. కానీ వరదల కారణంగా రోడ్లు అవీ బాగోలేవని, నన్ను రావద్దని రాసింది.

అమ్మ ఉత్తరం నాపై గొప్ప ప్రభావం చూపింది.

జవాబేం రాయాలో నాకు తెలియడంలేదు.

కానీ, ఈ రోజు బాత్రూంలో ఓ పురుగును షవరు నీటి నుంచి రక్షించాను.

వరదల్లో అమ్మ అవస్థ నా మనసుమీద చూపిన ప్రభావమే— బాత్రూంలో నా ప్రవర్తనకు కారణం!

శ్రీవారు సున్నిత మనస్కులు. అసలు విషయం సూటిగా చెప్పి నన్ను బాధపెట్టడం ఇష్టంలేక పరోక్షంగా అమ్మ ఉత్తరం గురించడిగారాయన.

''నీలో మంచి ఆలోచనా శక్తి వుంది. లోతుగా ఆలోచిస్తే స్త్రీ జాతికే మణిపూసవౌతావు. నీవేమైనా సాధించదల్చుకుంటే నా చేయూత నిస్తానని'' చెప్పి— ''నీ తెలివిని స్వార్థం మింగేస్తోంది'' అన్నారు శ్రీవారు.

వరదలో చిక్కుకున్న అమ్మ— నిత్యం చూసే పురుగుపై నాలో కరుణను కలిగించింది.

అమ్మ వరదల్లో చిక్కుకున్నదని తెలిసే వరకు నేను వరదల గురించిన వార్త పట్టించుకోలేదు. వరద బాధితుల హృదయ విదారక గాథలు నన్ను కదిలించలేదు.

నాన్నగారున్న ప్రాంతంలో వరదలు లేవని నాకు తెలుసు. అమ్మ ఆ సమయంలో ధవళేశ్వరంలో వుంటుందని నేనూహించలేదు.

సాటి మానవులు, నా తెలుగువారు— వరదల్లో నిరాశ్రయులై అలమటిస్తున్నారని వార్తల్లో చదివి చలించని నేను, అదే వరదల్లో అమ్మ చిక్కుకుని బయటపడిందని తెలియగానే ఒక మామూలు పురుగును కూడా నీటి బారినుండి రక్షించాను.

'లోతుగా ఆలోచించగల నీ తెలివిని స్వార్థం మింగేస్తోంది' అన్న శ్రీవారి మాటలు నా చెవుల్లో గింగురుమంటున్నాయి.

ఆయన మాటలు నిజమేనేమో!

కేవలం నాకోసమే కాకుండా నా చుట్టూ ఉన్నవారి గురించి కూడా కొంతైనా నా కాలాన్ని వినియోగించాలి.

నాలాంటివారిని హెచ్చరించడానికి ఎన్నో సంఘటనలు!

కానీ వాటినుంచి నేర్చుకునే దెందరు?

నేను మళ్ళీ బాత్రూంలోకి వెళ్ళాను.

మూలగా వుందాపురుగు...

ఇంకా అది షాక్ నుంచి తేరుకున్నట్లు లేదు.

నేనా పురుగునే చూస్తున్నాను.

దానిని నేను రక్షించాను. కానీ నాకిప్పుడది పురుగులా అనిపించడంలేదు. ఆ స్థానంలో— మా పనిమనిషి, మా యింటిముందు రోజూ అడుక్కునే బిచ్చగాడు, రెండు వారాలకోసారి అనాథ శరణాలయం చందాలంటూ వచ్చే చిన్నపిల్లలు, బస్ స్టాండులో మూటలు మోసే పదేళ్ళ కుర్రాడు... ఇలా ఎందరో కనబడుతున్నారు.

గోదావరి వరద మనిషిని పురుగు చేసింది.

మా బాత్రూం షవర్ వరదలో ఓ పురుగు నన్ను మనిషిని చేస్తోంది... ●


GEET MALA GM CASSETTES

ఆంధ్రజ్యోతి

సచిత్ర వార పత్రిక

మీ పౌరాణిక పరిజ్ఞానాన్ని పరీక్షించుకోండి

## పురాణకథల క్విజ్

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో ధారావాహికంగా ప్రచురిస్తూన్న 'పురాణ కథలు' శీర్షికకు అనుబంధంగా పాఠకులకు ఆసక్తికరమైన క్విజ్ త్వరలో ప్రారంభిస్తున్నాము.

భారత, రామాయణాలు, పురాణ కథలు ఆధారంగా గీత్ మాల, విజయవాడ వారు యీక్విజ్ నిర్వహిస్తున్నారు. ఈ 'పురాణ కథల క్విజ్'లో పాల్గొని అన్ని జవాబులూ సరిగా వ్రాయగలిగిన పాఠకుల నుంచి ప్రతివారం లాటరీ ద్వారా ఒక విజేతను ఎంపిక చేస్తాము. ఏ వారానికి ఆ వారం గెలుపొందిన పాఠకుడికి గీత్ మాలా వారు శ్రీ ప్రయాగ రామకృష్ణ చెప్పిన 'భారతంలో చిన్నకథలు' ఆడియో కేసెట్‌ను బహుమతిగా నేరుగా పంపుతారు.

\- ఎడిటర్

'పురాణకథల క్విజ్' త్వరలో ప్రారంభం!